

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA

RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | బుధవారం | 07-10-2026 | సంపుటి: 3 | సంచిక: 243 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 07-10-2026 | VOLUME : 3 | ISSUE : 243 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## భూకంపంతో ఉత్తరాఖండ్‌లో వణికిన భూమి

- రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదు
- రాత్రి 10:30 గంటల సమయంలో ప్రకంపనలు
- ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాలకు వ్యాపించిన ప్రభావం
- ప్రాణ, ఆస్తి నష్టంపై ఇప్పటివరకు సమాచారం లేదు

4



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ 'ఇండి' కూటమి నిరసన

- నీతి ఆయోగ్ సమీపంలో అడ్డుకున్న పోలీసులు
- పలువురు నేతల నిర్బంధం
- ఆకాశవాణి భవన్‌లో రాహుల్, ప్రియాంక బైఠాయింపు

4



# బీసీ కార్డు రేవంత్‌కు చెక్ పెట్టడానికేనా?

- తెలంగాణకు బీసీ నేత ముఖ్యమంత్రి కావడం ఖాయమన్న మహేష్ కుమార్ గౌడ్
- రేవంత్ రెడ్డి కూడా బీసీ నాయకత్వానికి మద్దతిస్తారని టీపీసీసీ చీఫ్ ప్రకటన
- బీసీ ఓటు బ్యాంకును ఆకర్షించడానికేనా.. బీజేపీ బీసీ సీఎం నినాదానికి కౌంటరా?
- రేవంత్ పదవిలో ఉండగానే సీఎం అభ్యర్థిత్వంపై చర్చకు తెరతీయడంలో రాజకీయ ఆంతర్యమేంటి?
- కాంగ్రెస్‌లో భవిష్యత్ బీసీ నాయకత్వాన్ని బలపరిచే వ్యూహమా?

**హైదరాబాద్, అక్టోబర్ 6:**

తెలంగాణ రాజకీయాల్లో బీసీ సీఎం అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో రాష్ట్రానికి బీసీ వర్గానికి చెందిన నేత ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన ప్రకటన కాంగ్రెస్‌లోనే కాకుండా రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీసింది. ఈ ప్రతిపాదనకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మద్దతు ఇస్తారని ఆయన చెప్పడం మరింత ఆసక్తికరంగా మారింది. వచ్చే టర్మ్‌లోనూ తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని రేవంత్ రెడ్డి చెబుతున్న సమయంలోనే భవిష్యత్‌లో బీసీ సీఎం అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు ప్రస్తావించడం వెనుక అసలు రాజకీయ వ్యూహం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రేవంత్‌కు చెక్ పెట్టే ప్రయత్నమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతున్న సమయంలోనే ప్రత్యామ్నాయ సీఎం సామాజిక వర్గంపై చర్చ తెరపైకి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్‌లో రెడ్డి సామాజికవర్గ ఆధిపత్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న బీసీ నేతలకు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు కొత్త

మిగతా 2వ పేజీలో..

## సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

- రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు సమిష్టి కృషి
- బ్లాక్ స్పాట్లను గుర్తించడమే కాదు
- శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలి
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి
- చింతన్ శివిర్‌లో కీలక ప్రసంగం

**ఎక్తానగర్ (గుజరాత్), అక్టోబర్ 6 :**

రహదారి భద్రతకు సంబంధించి కేవలం ప్రమాణాలు, మార్గదర్శకాలు రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి సురక్షితమైన రహదారులను అందించడమే ప్రభుత్వాల అసలైన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గుజరాత్‌లోని నర్మద జిల్లా ఎక్తానగర్ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్2026' సదస్సులో రెండో రోజు ఆయన పాల్గొన్నారు. డిజైనింగ్ సేఫ్ హైవేస్‌ఫ్రమ్ స్టాండర్డ్స్ టు ఇంప్లిమెంటేషన్ అనే అంశంపై జరిగిన ప్రత్యేక సెషన్‌కు అధ్యక్షత వహించి కీలకోపన్యాసం చేశారు. ప్రపంచంలోని అనేక దేశాలు రోడ్డు భద్రతను ఒక

మిగతా 2వ పేజీలో..



## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

- టవర్స్‌ను వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రోత్సాహకాలు
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

2



## డిమాండ్ పెరిగినా కోతలు లేవు

- జలవిద్యుత్ ఉత్పత్తి 4 వేల మెగావాట్లు తగ్గింది
- మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం పడింది
- గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**పులిచింతల, అక్టోబర్ 6 :**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతోపాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 15 వేల

మిగతా 3వ పేజీలో..

## పకడ్బందీగా ఎరువుల పంపిణీ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- ఖరీఫ్‌లో విజయవంతమైన డిజిటల్ విధానం
- ఫార్మర్స్ రిజిస్ట్రీలో తెలంగాణ ముందంజ



**హైదరాబాద్, అక్టోబర్ 6 :**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల పంపిణీ ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తయిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఫెర్టిలైజర్ యాప్‌ల ద్వారా పంపిణీని పర్యవేక్షించడం, ఎరువులను ముందుగానే అందుబాటులో ఉంచడం (అడ్వాన్స్ పొజిషనింగ్) వల్ల రైతులకు ఎరువుల కొరత రాలేదని ఒక ప్రకటనలో

మిగతా 2వ పేజీలో..

## ఎర్రవల్లిలో 'అమరవీరుల కాలనీ'..

- ఎర్రవల్లి, శివారు వెంకటాపురం భూములపై సీఎం సమీక్ష
- సర్వే నెం.325పై కేసీఆర్‌కు జారీ కానున్న నోటీసులు

**హైదరాబాద్, ప్రజాతంత్ర, అక్టోబర్ 6 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమికి గాను రెవెన్యూ అధికారుల సర్వేలో 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి

మిగతా 2వ పేజీలో..



## శంకర్ వైద్య ఖర్చులు నేనే భరిస్తా



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కిమ్స్ లో చికిత్స పొందుతున్న మెదక్ కానిస్టేబుల్ కుటుంబానికి భరోసా

3



## డిపెండెంట్‌లకు ఆర్డర్లు అందజేయాలి

- సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక నిర్ణయాలు
- సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి సమావేశం

2




## ట్రూఅప్ పేర ప్రజల నెత్తిన పిడుగు

- రూ.5420 కోట్లు ప్రజలపై భారం
- ఇప్పటికే ఎల్నినో, ధరలపెరుగుదలపై ప్రజల ఇబ్బందులు
- విద్యుత్ కొనుగోళ్లకు, ప్రజలకు ఏంటి సంబంధం?
- ప్రభుత్వ కొనుగోళ్లకు వినియోగదార్లపై భారమా?
- ప్రజా ఉద్యమం చేస్తాం
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్ రావు

3

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- 67 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ అనంతరం ఊరట
- రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం
- ప్రతి ఆదివారం పోలీసుల ముందు హాజరుకావాలని కోర్టు షరతు

2

# బీసీ కార్డు రేవంత్‌కు చెక్ పెట్టడానికేనా?

**మొదటిపేజీ తరువాయి**

ఉత్సాహాన్ని ఇచ్చినట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రేవంత్ వంటి బలమైన నేత ముఖ్యమంత్రి పదవిలో ఉండగానే భవిష్యత్ సీఎం సామాజిక వర్గాన్ని ప్రస్తావించడం ఆయన నాయకత్వంపై పరోక్షంగా ప్రభావం చూపించే అవకాశం ఉందన్న అభిప్రాయా

హైదరాబాద్, అక్టోబర్ 5:

అది ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రాజకీయ గ్రాఫ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందనే అభిప్రాయం రేవంత్ వర్గీయుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.

**రాహుల్ నినాదానికి అనుగుణంగానే బీసీ కార్డా?**

మరోవైపు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక ఇంజనీరింగ్ వ్యూహం ఉందనే విశ్లేషణ కూడా వినిపిస్తోంది. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, కులగణన అంశాలను రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో ప్రధానంగా ముందుకు తీసుకెళ్తున్నారు. తెలంగాణలో జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ వర్గాలను కాంగ్రెస్‌కు మరింత చేరువ చేయడంలో భాగంగానే బీసీ సీఎం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారా అన్న చర్చ జరుగుతోంది.

ఇదే సమయంలో బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బీజేపీ చేస్తున్న రాజకీయ ప్రచారానికి కౌంటర్ ఇవ్వాలన్న వ్యూహం కూడా ఇందులో ఉందనే విశ్లేషణలు ఉన్నాయి. బీసీ వర్గానికి చెందిన నాయకత్వాన్ని భవిష్యత్ ప్రత్యామ్నాయంగా ప్రాజెక్ట్ చేయడం ద్వారా ఆ వర్గంలోని నేతలు, ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కాంగ్రెస్‌పై నమ్మకాన్ని పెంచే ప్రయత్నం జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కాంగ్రెస్‌లో ముందుగానే బీసీ కార్డు**

రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో బీసీ కార్డును ముందుగానే తెరపైకి తీసుకొచ్చారన్న చర్చ కూడా జరుగుతోంది. ఒకవైపు రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని కొనసాగిస్తూనే మరోవైపు బీసీ వర్గాలకు భవిష్యత్‌లో కీలక ప్రాధాన్యం ఉంటుందనే సంకేతాలను ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయాలన్న వ్యూహం ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి పదవిలో ఉండగానే భవిష్యత్ సీఎం అంశాన్ని ప్రస్తావించడం కాంగ్రెస్‌లో అంతర్గత పవర్ పాలిటిక్స్‌కు సంకేతమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఇదే అంశాన్ని అందిపుచ్చుకుని కాంగ్రెస్‌లో రేవంత్ నాయకత్వంపై అసమ్మతి ఉందని ప్రచారం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి స్వయంగా బీసీ సీఎం ప్రతిపాదనకు మద్దతిస్తారని చెప్పడం ద్వారా అధిష్ఠానం ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టిందన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. బీసీ సీఎం అంశం కాంగ్రెస్‌కు సామాజికంగా విస్తరించే రాజకీయ అవకాశాన్ని కల్పించడంతో పాటు, పార్టీలో నాయకత్వ సమీకరణాలపై కొత్త చర్చకు కారణమైంది. రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని కొనసాగిస్తూనే బీసీ వర్గాల రాజకీయ ఆకాంక్షలను ఎలా సమన్వయం చేస్తారన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ బీసీ కార్డు భవిష్యత్ ఎన్నికల వ్యూహంలో ఎంత కీలకంగా మారుతుందో వేచి చూడాల్సిందే.



# పకడ్బందీగా ఎరువుల పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్‌ల ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా 33.39 లక్షల మంది రైతులకు 128.18 లక్షల యూరియా బస్తాలను పంపిణీ చేయగా, కేంద్ర ప్రభుత్వ ఎఫ్‌ఎఫ్ఎస్ యాప్ ద్వారా 37.48 లక్షల మందికి 104.99 లక్షల అన్ని రకాల ఎరువుల బస్తాలను అందించినట్లు వివరించారు. ఈ డిజిటల్ విధానంతో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలకు అడ్డుకట్ట పడిందని, ఫలితంగా గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈసారి 35 వేల టన్నుల యూరియా వాడకం తగ్గిందని పేర్కొన్నారు.

**భారీగా ఎరువుల నిల్వలు**

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో యూరియా నిల్వలు గణనీయంగా పెరిగాయని మంత్రి తుమ్మల వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో కేవలం 0.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే ఉండగా, ప్రస్తుతం 2.33 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. అలాగే డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు కూడా రైతులకు సరిపడా ఉన్నాయని తెలిపారు. విదేశాల నుంచి వచ్చే ఎరువుల షిప్‌మెంట్లు ఆలస్యం కాకుండా షిప్‌యార్డుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకున్నామని వివరించారు.

**డిజిటల్ క్రాప్ బుకింగ్.. భవిష్యత్ పథకాలకు ఆధారం**

రైతుల సమగ్ర సమాచారంతో కూడిన 'ఫార్మర్స్ రిజిస్ట్రీ' రూపకల్పనలో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 202627 వానాకాలానికి గాను రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ఇప్పటికే 75.9 శాతం (1.46 కోట్ల వ్యవసాయ క్షేత్రాలు) పూర్తయిందన్నారు. భవిష్యత్తులో పంటల కొనుగోళ్లు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ తదితర ప్రభుత్వ పథకాలన్నింటికీ ఈ డిజిటల్ క్రాప్ బుకింగ్ వివరాలే ప్రాతిపదికగా ఉంటాయని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఎర్రవల్లిలో 'అమరవీరుల కాలనీ'..

**మొదటిపేజీ తరువాయి**

వివరించగా మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడుందో తేల్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో అధికారులు సర్వే నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు భూమి సరిహద్దులో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రెవెన్యూ రికార్డులు అందజేయాలని అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. సర్వే నంబర్ 325లో ఉన్న భూమిని స్థానిక అర్హులైన రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్నది. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి



కుటుంబాలకు కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, సకల సౌకర్యాలతో కాలనీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ డిపార్టుమెంటుకు అప్పగించాలని సూచించారు. జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# డిపెండెంట్‌లకు ఆర్డర్లు అందజేయాలి

**హైదరాబాద్,అక్టోబర్ 6 :**

సింగరేణి బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సుదీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సింగరేణి ప్రాంత మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, డాక్టర్ మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, గండ్ర సత్యనారాయణ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ప్రజా భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సమస్యలను, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను ప్రజాప్రతినిధులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వాటన్నింటినీ సానుకూలంగా విని తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుండి 300 వరకు ఉన్న డిపెండెంట్ ఆర్డర్లను, ఇతర లీగల్ ప్రాసెస్‌లను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థులకు అందజేయాలని ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించి సుమారు 136 మంది(గరిష్ఠంగా 170 మంది) సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి ఇందుకు ఏర్పాటు చేసిన సింగరేణి ఆఫీసర్స్ కమిటీ సిఫారసుల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు రావాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో ప్రతి నెలా ఒక నిర్ణీత బోర్డు మీటింగ్ నిర్వహించాలన్నారు. అక్కడే వీలైనంతమందికి పరీక్షలు నిర్వహించి మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాల వల్ల విధులకు హాజరుకాక ఉద్యోగాల నుండి తొలగింపునకు గురైన కార్మికుల విషయంలో వన్ టైం ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. విధులు నిర్వర్తించకుండా సమ్మెకు పిలుపునిచ్చిన లేదా సమ్మెలో పాల్గొన్న అధికారులపై, దానికి నాయకత్వం వహించిన వారిపై 'నాన్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్యూటీస' కింద ఒక చిన్న హెచ్చరిక జారీ చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు సింగరేణి సంస్థ అప్పగించగా అందులో 4,500 ఎకరాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు పట్టాలు పంపిణీ చేశారని, మిగతా 1250 ఎకరాల్లో జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితాను సిద్ధం చేసి స్థానిక శాసనసభ్యులతో సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను తయారు చేసి ఈ ప్రక్రియ మొత్తాన్ని నెల రోజుల లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సింగరేణి భూముల్లో మైనింగ్ చేయని ప్రదేశాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇండ్ల నిర్మాణం కోసం లేఅవుట్ చేసి నెహ్రూ హౌజింగ్ కాలనీ తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కూడా భట్టి ఆదేశించారు. సింగరేణి సంస్థ ఏరియా హాస్పిటల్స్‌ను కార్పొరేట్ హాస్పిటల్స్‌గా తీర్చిదిద్దాలన్నారు. అవసరమైతే వైద్యులకు వేతనాలు, పరిహారం పెంచి నిపుణులైన డాక్టర్లను నియమించాలని, అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్‌లాబ్ సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. బొగ్గు గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రాంతీయ ప్రజలలో క్యాన్సర్ ముప్పు పెరుగుతోందని పలు అధ్యయనాలు తెలుపుతున్నందున సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. సింగరేణి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ హాస్పిటల్స్, ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి సోలరైజ్ చేయాలని సూచించారు. ఖరీదైన వ్యాపార, పట్టణ భూములను కమర్షియల్ వినియోగానికి, ఊరి బయట ఉన్న ఉపయోగపడని భూములు, ఓవర్ బర్డెన్ గుట్టలను సోలార్ ప్లాంట్లకు ఉపయోగించాలని స్పష్టం చేశారు. సింగరేణి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ (వ్యవసాయ పరిశోధనా కేంద్రం) ఏర్పాటుకు సింగరేణి సంస్థ నుంచి స్థలం కేటాయించాలని, ఆ స్థలానికి బదులుగా రెవెన్యూ భూములలో ఉపయోగపడని గుట్టల భూమికి సంబంధించి నివేదికను సమర్పించాలని సూచించారు. సింగరేణి కార్మికులకు ఆరు నెలలకొకసారి ఖచ్చితంగా సేఫ్టీ కిట్స్ పంపిణీ చేయాలన్నారు. రామగుండంలో సింగరేణి ఆధ□ర్యంలో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సింగరేణి సంస్థలోని ఉద్యోగులకు చెల్లిస్తున్నట్టుగానే కార్మికులందరికీ సంస్థ నుంచే ప్రభుత్వానికి ఆదాయ పన్ను చెల్లించాలని ఆదేశించారు. సత్తుపల్లి భూపాలపల్లి ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తి మేరకు వారి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలన్నారు. శిథిలమైన డి టైప్ క్వార్టర్స్‌ను తొలగించి వాటి స్థానంలో కార్మికుల జీవన ప్రమాణాలు పెంచే విధంగా అన్ని వసతులతో నూతన క్వార్టర్స్ నిర్మించి నెహ్రూ పేరిట సింగరేణి కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణివ్యాప్తంగా అన్ని కాలనీలను ఆధునికీకరించాలని, అత్యాధునిక డ్రైనేజి వ్యవస్థ, విద్యుదీకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సదుపాయం కల్పించాలని, సింగరేణివ్యాప్తంగా మురుగు శుద్ధి కేంద్రాల నిర్వహణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు.

# సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ప్రత్యేక వృత్తిపరమైన విభాగంగా పరిగణిస్తున్నాయని మంత్రి తెలిపారు. రహదారిపై ఒక్క మరణం లేదా తీవ్ర గాయం కూడా ఆమోదయోగ్యం కాదనే స్వీడన్ దేశపు 'విజన్ జీరో' విధానాన్ని, అలాగే ఆస్ట్రేలియా అనుసరిస్తున్న 'సేఫ్ సిస్టమ' విధానాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిజైన్ దశ నుంచి నిర్వహణ వరకు నిరంతరంగా రోడ్డు భద్రతా ఆడిట్లు జరగాలని, ఇందుకోసం స్వతంత్ర 'రోడ్డు భద్రతా అంబుడ్స్‌మన' లేదా 'సేఫ్టీ అథారిటీ' వ్యవస్థ ఏర్పాటును పరిశీలించాలని సూచించారు.

**ఎన్‌హెచ్-65 విస్తరణకు వెంటనే శ్రీకారం చుట్టాలి**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65)పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న 4లేన్ల రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఈ రహదారిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెంటనే 6G2 లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచఏఐ) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విస్తరణపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా ఉన్నారని, త్వరలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని మంత్రి వెల్లడించారు.

**బ్లాక్ స్పాట్లకు శాశ్వత పరిష్కారాలు**

ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించడంతోనే పని అయిపోయిందని అనుకోకుండా, అక్కడ శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలను చూపాలని మంత్రి స్పష్టం చేశారు. సరైన జంక్షన్లు, సర్వీస్ రోడ్లు, పాదచారుల సౌకర్యాలు కల్పించడానికి భూసేకరణ అత్యంత కీలకమన్నారు. సీసీటీవీ నిఘా, జీఐఎస్ మ్యాపింగ్, డ్రోన్లు వంటి సాంకేతికతలను విస్తృతంగా ఉపయోగించి ప్రమాదాలను ముందే పసిగట్టాలన్నారు.

**కాపాడిన ప్రాణాలే గీటురాయి**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నిర్దేశించిన విధంగా 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని కోమటిరెడ్డి పిలుపునిచ్చారు. భద్రతతో కూడిన డిజైన్, నిర్మాణం, నిర్వహణ, సాంకేతికత వినియోగం, నిరంతర సమీక్ష అనే ఐదు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. హైవే ప్రాజెక్టుల విజయాన్ని ఎన్ని కిలోమీటర్లు నిర్మించాం, ఎంత సమయం తగ్గించాం అనే లెక్కలతో కాకుండా మనం ఎన్ని ప్రాణాలను కాపాడగలిగాం అనే ఏకైక ప్రశ్నతోనే కొలవాలని మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, నేషనల్ హైవేస్ చీఫ్ ఇంజినీర్ ధర్మారెడ్డి, ఇతర రాష్ట్రాల ఉన్నతాధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్

- **67 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ అనంతరం ఊరట**
- **రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం**
- **ప్రతి ఆదివారం పోలీసుల ముందు హాజరుకావాలని కోర్టు షరతు**
- **జూలై 29న నల్గొండలో అరెస్టు.. చంచల్‌గూడ జైలులో రిమాండ్**

**హైదరాబాద్, అక్టోబర్ 6:**

లైంగిక వేధింపులు, బెదిరింపుల ఆరోపణలతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దాదాపు 67 రోజుల అనంతరం మంగళవారం ఆయనకు ఊరట లభించింది. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరిస్తూ ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ముందు హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశించారు.

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడ్డారనే ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూలై 29న నల్గొండ జిల్లా దామరచర్ల వద్ద ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయనకు తాజాగా బెయిల్ లభించింది.



# ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

**హైదరాబాద్, అక్టోబర్ 6 :**

క్యూర్ పరిధిలో తొలి విడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని, అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ.90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, పలువురు లబ్దిదారులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్‌ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం ఏడు వేలకు పైగా దరఖాస్తులు అందగా పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని, వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి 480 మందిని తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతోపాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితోపాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్దిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాక కార్యరూపంలోకి తీసుకొస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదలు ధనవంతులవుతారు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గాజుల రామారంలో 480 ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన అనంతరం ఆయన ప్రసంగించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల కోర్ అర్బన్ రీజియన్(క్యూర్) పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎంత వ్యయమైనా భరించాలని నిర్ణయించారన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం తర్వాత వాటి ధరలు రూ.50 లక్షల పైనే పలుకుతాయని, ఇది పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. కొత్తగా నిర్మించే టవర్స్ సముదాయంలో ఆలయాలు, మసీదులు, చర్చి వంటి ప్రార్థనా మందిరాలను నిర్మించుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయింపును పరిశీలించాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించినట్టు చెప్పారు. క్యూర్ పరిధిలోని కాలుష్య పరిశ్రమలను వెలుపలికి తరలించి స్వచ్ఛమైన గాలి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీలను ఒకటొకటిగా అమలు చేస్తున్నామని, అందులో ఇందిరమ్మ ఇళ్లు అత్యంత ప్రాధాన్యత కలిగిన పథకమని వెల్లడించారు.

# ట్రూ-అప్ పేర ప్రజల నెత్తిన పిడుగు

**హైదరాబాద్, అక్టోబర్ 6:**

దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్త చెప్పాల్సిన ప్రభుత్వం, విద్యుత్ బిల్లులు పెంచి నెత్తిన పిడుగు వేసింది.ట్రూఅప్ పేరుతో ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.5,420 కోట్లు ప్రజల ముక్కు పిండి వసూలు చేయాలనే ఒక దుర్మార్గమైన నిర్ణయం తీసుకున్నరు. ఒక దిక్కు ఎల్ నినో, మరోవైపు ధరల పెరుగుదల ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు.ప్రజల తరుపున నేను రేవంత్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా రూ.5,420 కోట్ల విద్యుత్ బిల్లులను వినియోగదారులపై మోపే హక్కు మీకు ఎవరు ఇచ్చారు? విద్యుత్ కొనుగోళ్లకు వెచ్చించిన సొమ్మును వినియోగదారుల నుంచే వసూలు చేయాలనుకోవడం ఎంతవరకు సమంజసం? బాధ్యత నుంచి తప్పించుకున్న ప్రభుత్వం ప్రజలపై భారం వేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే కరెంట్ కోతలతో అల్లాడుతున్న ప్రజలకు..ఇప్పుడు కరెంట్ బిల్లులు పెంచి వాతలు పెడతారా అని ప్రశ్నించారు. ప్రజలపై భారం మోపే కాంగ్రెస్ సర్కారు తుగ్లక్ నిర్ణయాన్ని బిఆర్ఎస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలపై 5వేల కోట్ల భారం మోపాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఈరోజు రాష్ట్రంలో ఒక తుగ్లక్ పాలన నడుస్తున్నది. స్వయంగా ముఖ్యమంత్రి పాలన చేతగాక చేతులెత్తేసిన పరిస్థితి. పరిపాలనపై ధ్యాస లేదు అనడానికి సంక్షోభంలో కూరుకుపోతున్న విద్యుత్ రంగమే నిదర్శనం. తప్పు చేసింది కాంగ్రెస్.. విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టింది కాంగ్రెస్.. కానీ భారం మాత్రం ప్రజలపై వేస్తున్నరు. కరెంట్ సరఫరా చేయలేని చేతగాని సర్కారు.. బిల్లులు పెంచి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నది. నిర్వహణ లోపాలు, నిర్లక్ష్యంతో విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి.. ఇప్పుడు ఆ భారాన్ని ప్రజలపైకి నెడుతారా? ఇదేం పాలన రేవంత్ రెడ్డి? మీరు చేసిన తప్పుకు వినియోగదారులు బలి కావాలా? 5వేల కోట్లు అంటే మాటలా? రెండు నెలల్లో వినియోగదారుల నుంచి వసూలు చేయడం దుర్మార్గమన్నారు. పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి ఇలాంటి తుగ్లక్ నిర్ణయాలు ఎన్నడూ తీసుకోలేదు.201617 నుంచి 202122 వరకు ట్రూఅప్ చార్జీలు రూ.12,718.40 కోట్లు వేయాలని ఇఆర్సీ చెప్పినా ఈ భారాన్ని వినియోగదారులపై మోపేందుకు కేసీఆర్ గారు అనుమతించలేదు. విద్యుత్ సంస్థల భారాన్ని ప్రజలపై వేయొద్దు అని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. కానీ ఈ రోజు రేవంత్ రెడ్డి కరువు పరిస్థితుల్లో ప్రజలపై 5200 కోట్ల భారం వేస్తున్నడు.ఇది ప్రజాపాలన కాదు, ప్రజా పీడన. ఉమ్మడి పాలనలో కరెంట్ కోతలతో రైతులు పడ్డ నరకయాతనను కండ్ల నిండా చూసిన కేసీఆర్ గారు, అధికారంలోకి రాగానే విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసారని గుర్తుచేశారు.

విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి 91,000 కోట్లతో జెన్‌కో, ట్రాన్స్‌కో అభివృద్ధి సహా మౌలిక వసతులను బలోపేతం చేశారన్నారు. మొత్తంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 19,450 మెగావాట్లకు పెంచారన్నారు. అనతి కాలంలోనే రాష్ట్రాన్ని 'పవర్' ఫుల్ తెలంగాణగా నిలబెట్టిండు. అన్ని రంగాలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే స్థాయికి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేసిండు. కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్లాంట్లను 42 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించాం. భద్రాద్రి 1080 మెగావాట్లతో నిర్మించాం. 4000 మెగావాట్లతో ఆల్ట్రా థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. భూపాలపల్లిలో 600 మెగావాట్లను ఉత్పత్తి అందుబాటులోకి తెచ్చినం.ఒక్క థర్మల్ లోనే 6480 మెగవాట్లు యాడ్ చేసినం. సోలార్ పవర్ 3600 మెగావాట్లు యాడ్ చేసినం.విద్యుత్ వ్యవస్థను ఎంతో బలోపేతం చేసినం. సింగరేణి మరో 800 మెగావాట్ల విషయంలో రాజస్థాన్ తో జేవీ చేసుకున్నరు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన కొత్త పని ఒక్కటీ లేదు.కొత్తగా ఒక్క సబ్ స్టేషన్ కట్టింది లేదు..కొత్తగా ఒక్క మెగావాటు ఉత్పత్తి సామర్థ్యం పెంచింది లేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏమైంది.

కరెంట్ కే కరోనా పట్టినట్లు అయ్యింది.కరోనా కంటే, ఎల్ ని నో కంటే కాంగ్రెస్ డేంజర్ అని మేము నోటి మాటగా చెప్పడం లేదు

అవకాశం ఉండి నీళ్లు ఇవ్వడం లేదు, అవకాశం ఉండి కరెంట్ ఉత్పత్తి చేయడం లేదు.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫుల్ గా ఉన్న కరెంట్ ఇప్పుడు ఎందుకు నిల్ అయ్యింది. కేసీఆర్ ఉన్నపుడు 24 గంటల కరెంట్ వస్తే, ఇప్పుడు ఎందుకు 6 గంటలు కూడా కరెంట్ రాని పరిస్థితి వచ్చింది. అన్నింటికి ఒకే మంత్రం అన్నట్లు.. మీ పాలన వైఫల్యాన్ని, చేతగాని తనానికి ఎల్ ని నో పేరు చెప్పి, కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటారా? ఎల్ నినోకు బొగ్గు ఉత్పత్తికి కారణం ఏమిటి? దేవాదులలో 24 గంటల మోటార్లు నడపండి అంటే 8 గంటలే నడుపుతున్నరు. దీని వల్ల వరంగల్ జిల్లాకు కరవు వచ్చింది.ఎల్ ని నో కరువు కాదు, కాంగ్రెస్ కరువు. కల్వకుర్తి ప్రాజెక్టును కేసీఆర్ గారు పూర్తి చేస్తే, నీళ్లు ఎత్తు అంటే 8 గంటలే కల్వకుర్తి మోటార్లు నడుపుతున్నరు. నీళ్లు ఇచ్చే ఉద్దేశ్యం లేదు. కన్నెపల్లి దగ్గర కట్క ఒత్తితే నీళ్లు వస్తయి ఎత్తుమంటే, ఎన్డీఎస్ఏ కారణం చెప్పారు. కానీ ఆ ఎన్డీఎస్ఏనే చెంప ఛళ్లుమనేలా సమాధానం చెప్పింది. భద్రాద్రి, యాదాద్రి, సింగరేణి థర్మల్, కేటీపీఎస్ విద్యుత్ కేంద్రాలు నిర్మిస్తే, వాటిని నడిపే తెలివి కూడా ఈ ప్రభుత్వానికి లేదు.భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లో మూడో యూనిట్ ఉత్పత్తి ఎందుకు నిలిచిపోయింది.యాదాద్రి పవర్ ప్లాంట్ సామర్థ్యం 4వేల మెగావాట్లు అయితే 400 కూడా ఉత్పత్తి చేయడం లేదు. సింగరేణి బొగ్గు సంస్థ ఉండి కూడా సింగరేణి థర్మల్ ప్లాంట్ కు బొగ్గు సరఫరా చేయలేని పరిస్థితి. నదుల్లో నీళ్లు ఉన్నా రిజర్వాయర్లు నింపలేదు, నీళ్లు లిఫ్ట్ చేయలేదు. బొగ్గు ఉన్నా సరఫరా చేయరు, కరెంట్ ఉత్పత్తి చేయరు.రూ. 1600 కోట్లు విలువ చేసే 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయం అయ్యాయని, అదో పెద్ద కుంభకోణం అని మేం ముందు నుంచి హెచ్చరించాం.లేని నిల్వలు ఉన్నట్లు చూపి టాక్స్, కోల్ సెస్, సీఎస్ఆర్ చెల్లింపులు చేసి మోసం చేసారని సింగరేణి వ్యాప్తంగా తిరిగి పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చినం. ఇప్పుడు ఏం అయ్యింది. బొగ్గు నిల్వలు లేవు అన్న విషయం తేటతెల్లం అయ్యింది. అప్పుడు బొగ్గు కుప్పల మీద సేల్ బొగ్గు వేసి కవర్ చేసే ప్రయత్నం చేసారు. మరి ఇప్పుడు ఎల్ ని నో వల్లే కరెంట్ ఉండటం లేదని కారణం చెబుతున్నారు.

**పాలన తక్కువ, ప్రతిపక్షాల మీద బురద జల్లడం ఎక్కువ.రైతులకు అనేక ఇబ్బందులు ఉన్నా పట్టించుకోవడం లేదు.**

మీ నిర్లక్ష్యం, మీరు చేసిన పాప ఫలితం ఈరోజు రాష్ట్రంలో కరెంట్ సంక్షోభం. ఉచిత కరెంట్ పేటెంట్ కాదు, పేషెంట్ అయ్యింది. చేతికి వచ్చే పంటను కాపాడుకుందాం అంటే కరెంట్ లేదు, నీళ్లు లేవు. కడుపు మండిన రైతులు సబ్ స్టేషన్ల ముందు ధర్నాలు చేస్తున్నరు. గ్రామీణ ప్రాంత రైతులు కరెంట్ కోసం పోరాటాలు చేస్తున్నరు. నీ కొండారెడ్డి పల్లిలోనే రైతులు రోడ్లెక్కి ధర్నాలు చేస్తుంటే నీకు కనిపించడం లేదా రేవంత్ రెడ్డి. కరెంట్ కోతలు, లో ఓల్టేజ్ సమస్యతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. క్రాప్ హాలిడే, పవర్ హాలిడేలను ఉమ్మడి పాలనలో చూసినం. మీ పాలనలో మల్లా క్రాప్ హాలిడే, పవర్ హాలిడేలు తెస్తున్నవు.ఆనాటి రోజులు తెస్తాం అన్న రేవంత్ రెడ్డి, నిజంగానే ఆనాటి కరెంట్ కోతల రోజులు తెచ్చిండు.నాడు కోతలు పెడితే, కరెంట్ ధరలు పెంచితే నాడు తెలుగు దేశంకు ప్రజలు షాక్ ఇచ్చారు. నేడు నువ్వు ధరల నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే షాక్ తప్పదు అని హెచ్చరిస్తున్నాం. కేసీఆర్ ప్రతి రోజు 140 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తే, అందులో 100-110 యూనిట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదు? బొగ్గు లేక, నీళ్లు లేక సరైన నిర్వహణ లేక యాదాద్రి జనరేషన్ కెపాసిటీ 96 మిలియన్ యూనిట్లు అయితే, 39 మిలియన్ యూనిట్లు కూడా దాటడం లేదు? ఉన్న కెపాసిటీని వినియోగించే తెలివి లేదు, బయట నుంచి రూ.10, 12లకు యూనిట్ కొని ప్రజలపై భారం వేస్తారా? అడ్డగోలుగా విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపుతారా? రాష్ట్రంలో మొత్తం థర్మల్ విద్యుత్ ఇన్టాల్డ్ కెపాసిటీ 13,384 మెగావాట్లు అయితే, 8000 మెగావాట్లు కూడా ఉత్పత్తి చేయడం లేదు? ఇది నిర్వహణ లోపం కాకుంటే ఏమిటి రేవంత్ రెడ్డి? నైనీలో మంచి బొగ్గు అందుబాటులో ఉన్నా.. అది కాదని విదేశాల నుంచి అధిక ధరకు బొగ్గు దిగుమతి చేసుకుంటరట లేని బొగ్గు 40లక్షల టన్నులు ఉన్నట్లు చెప్పారు. అది కుంభకోణం అని బయటపెట్టి కిషన్ రెడ్డికి లేఖ రాస్తే చర్యలు తీసుకోలేదు. ఇది చాలదన్నట్లు ట్రాన్స్ కోను ప్రైవేటుపరం చేసే నిర్ణయం తీసుకున్నరు.వేల కోట్ల ఆస్తులున్న రాష్ట్ర విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్‌ను అమ్మేందుకు సిద్ధమైంది. 26శాతం వాటాల విక్రయానికి నిర్ణయించుకున్నరు.టీజీట్రాన్స్‌కో, టీజీజెన్‌కో, సింగరేణి, డిస్కంల ప్రైవేటీకరణకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు చేస్తున్నది. రాహుల్ గాంధీనేమో పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయొద్దు అని అంటడు, సిడబ్లుసీ లో తీర్మానాలు చేస్తరు.కానీ ఇక్కడేమో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తరట.కేసీఆర్ థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటు వాళ్లు పెడతం అంటే ఒప్పుకోలేదు. యాదాద్రి, భద్రాద్రి, సింగరేణి ప్లాంట్లు పెట్టి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేసారు. ఇప్పటికే యాదాద్రిలో యాష్, కోల్ ప్లాంట్ల ప్రైవేటీకరణ పూర్తి చేసారు. విద్యుత్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాలపై పోరాటం చేయాలని కోరుతున్నాం., వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే, కాంగ్రెస్ విధానాలపై మీది ఒకటే మాట అయితే ఇక్కడి ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతున్నాం. ఇవన్నీ చాలదన్నట్లు ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరిట ఏకంగా 5,420 కోట్లు ప్రజల పై వేస్తారా? బొగ్గు నిల్వలు చేసుకోవడంలో కాంగ్రెస్ ఫెయిల్.రిజర్వాయర్లు నింపి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ఫెయిల్. హైడల్ విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కాంగ్రెస్ ఫెయిల్. మరి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు ప్రజలు ఎందుకు మూల్యం చెల్లించాలి? ఎవరు ఆదేశిస్తే ఈ నిర్ణయాలు అమలు చేస్తున్నావు రేవంత్ రెడ్డి ?సరిగ్గా 16 ఏండ్ల క్రితం చంద్రబాబు అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచినందుకు, బషీర్ బాగ్ కాల్పుల దాకా వెళ్లింది. ఈరోజు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపి ఏం చేయదల్చుకున్నావు. ఆనాడు విద్యుత్ బిల్లులపై పోరాటం చేసిన కమ్యూనిస్టులు, నేడు రేవంత్ రెడ్డి చేసే పాపంలో పాల్పంచుకోకండి.ప్రధాన ప్రతిపక్షంగా బిఆర్ఎస్ చేసే పోరాటంలో పాల్పంచుకోవాలని, కలిసి రావాలని కోరుతున్నాం. ట్రూఅప్ పేరుతో ప్రజలపై మోపే విద్యుత్ బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని, రూ.5,420 కోట్ల ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఈ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే మరో ప్రజా పోరాటానికి బిఆర్ఎస్ సిద్ధమవుతుందని హెచ్చరించారు.

# డిమాండ్ పెరిగినా కోతలు లేవు

**మొదటిపేజీ తరువాయి**

మెగావాట్లు ఉండగా ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు నాలుగు వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా ఎనిమిది వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రాజెక్టుల యంత్రాలు, యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసే స్థితిలోనే ఉన్నాయని చెప్పారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనకంటే పెద్దదైన కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని తెలిపారు. ఏపీలో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందన్నారు.

**నీటి వినియోగంలో జాగ్రత్త అవసరం**

రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్తు కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

**27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా వీటిని అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. మునగాలలో విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డిలకు కాంగ్రెస్ శ్రేణులు, అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన వరకు దాదాపు నాలుగు కిలోమీటర్లు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రూ.9.6 కోట్లతో నిరించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు భట్టి విక్రమార్క, ఉత్తంకుమార్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు.

# హైపర్ లోకల్ యాడ్స్‌పై కొత్త నిబంధనలు

- **యాడ్‌పై క్యూఆర్ కోడ్, ప్రింటర్ ఐడీ తప్పనిసరి**
- **చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విగ్రహాలు, వారసత్వ కట్టడాలపై నిషేధం**
- **అక్రమ ప్రకటనల తొలగింపు.. చలాన్‌తో పాటు ఖర్చుల వసూలు**
- **పదేపదే నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలు, వ్యక్తులపై బ్లాక్‌లిస్ట్ వేటు**

**హైదరాబాద్, అక్టోబర్ 6:**

తెలంగాణలో CURE పరిధిలో తాత్కాలిక, హైపర్ లోకల్ ప్రకటనల ఏర్పాటుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రకటనల ఏర్పాటు, స్లాట్ బుకింగ్, ధ్రువీకరణ, నిబంధనల అమలుకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రతి వార్డుకు ఒక నోడల్ అధికారిని నియమించనున్నారు. తాత్కాలికంగా 5 నుంచి 10 హైపర్ లోకల్ ప్రకటనలకు వీలుగా 25 నుంచి 50 స్థలాలను గుర్తిస్తారు. సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఈ స్థలాలను పరిశీలించి ఆమోదిస్తారు.

**స్లాట్ బుకింగ్‌కు కొత్త విధానం**

MyCURE లేదా అడ్వర్టైజింగ్ యాప్ ద్వారా కనీసం 7 రోజుల ముందే ప్రకటన స్లాట్‌ను బుక్ చేసుకోవాలి. ఒక మొబైల్ నంబర్‌తో ఒకేసారి ఒక స్లాట్ మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. బుక్ చేసిన ప్రతి ప్రకటన కుడి దిగువ భాగంలో క్యూఆర్ కోడ్, ఎడమ దిగువన ప్రింటర్ ఐడీ తప్పనిసరిగా ముద్రించాలి. నోడల్ అధికారి వాటిని స్కాన్ చేసి ధ్రువీకరించిన అనంతరం వివరాలను సంబంధిత పోలీసులకు పంపుతారు.

**నిషేధిత ప్రాంతాల్లో ప్రకటనలకు నో**

చెట్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విగ్రహాలు, వారసత్వ కట్టడాలపై ప్రకటనలు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. ట్రాఫిక్, పాదచారుల రాకపోకలు, ట్రాఫిక్ సిగ్నల్స్‌కు ఎలాంటి ఆటంకం కలిగించకూడదు. సీసీటీవీ కెమెరాల పనితీరుకు కూడా ప్రకటనల వల్ల అంతరాయం ఏర్పడకూడదని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

అనుమతి లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రకటనలను మున్సిపల్, పోలీసు, హైడ్రా అధికారులు వెంటనే తొలగిస్తారు. ఉల్లంఘనలకు చలాన్ విధించడంతో పాటు ప్రకటన తొలగింపునకు అయిన ఖర్చును కూడా దరఖాస్తుదారుడి నుంచే వసూలు చేస్తారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే ఏజెన్సీలు, వ్యక్తులను బ్లాక్‌లిస్ట్ చేసే అవకాశం కూడా మార్గదర్శకాల్లో కల్పించారు.

# శంకర్ వైద్య ఖర్చులు నేనే భరిస్తా

**హైదరాబాద్, అక్టోబర్ 6:**

విధి నిర్వహణలో బ్రెయిన్ స్ట్రోక్ కు గురై కిమ్స్ సికింద్రాబాద్లో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. శంకర్ వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు కేటీఆర్ తెలిపారు. ఈ విషయాన్ని శంకర్ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని కోరారు. శంకర్ ఆరోగ్య పరిస్థితి, ఆయన కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి తెలుసుకున్న కేటీఆర్ మానవతా దృక్పథంతో స్పందించారు. 'శంకర్ వైద్య ఖర్చులను నేను వ్యక్తిగతంగా చూసుకుంటాను'. ఆయన తిరిగి సాధారణ స్థితికి వచ్చే వరకు మనం కుటుంబానికి అండగా ఉన్నామని వారికి తెలియజేయండి' అని ప్రవీణ్ కుమార్ కు చెప్పారు.

శంకర్ కుటుంబ సభ్యులు ఇప్పటికే వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంధువులు, స్నేహితులు, సహచర పోలీసులు కలిసి ఇప్పటివరకు సుమారు రూ.1.5 లక్షలు సమకూర్చి ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న శంకర్కు మరోసారి భారీగా వైద్య ఖర్చులు అవసరం కావడంతో సహచర పోలీసులు ఒక్కొక్కరు తమకు తోచినంత సాయం చేస్తున్నారు. శంకర్ దయనీయ పరిస్థితిని చూసి బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్ విధి నిర్వహణలోనే తీవ్ర అనారోగ్యానికి గురైనా, అత్యవసర సమయంలో ఈహెచ్ఎస్ ద్వారా తక్షణ వైద్య సహాయం అందకపోవడం పట్ల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2013 నుంచి హోంగార్డుగా పనిచేసిన శంకర్ 2024 తర్వాత కానిస్టేబుల్ గా మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల విధి నిర్వహణలో ఉండగానే అకస్మాత్తుగా కుప్పకూలారు. బ్రెయిన్ స్ట్రోక్ గా నిర్ధారణ కావడంతో మొదట వెల్నెస్ ఆసుపత్రికి, అనంతరం నిమ్స్ కు తరలించారు. బెడ్లు అందుబాటులో లేకపోవడంతో యశోదకు తీసుకెళ్లగా ఈహెచ్ఎస్ పై సమస్య తలెత్తిందని కుటుంబ సభ్యులు తెలిపారు. చివరకు కిమ్స్ సికింద్రాబాద్ లో చికిత్స ప్రారంభించారు.

**కేటీఆర్ స్పందించే వరకు ఎందుకు పట్టించుకోలేదు?**

శంకర్ కుటుంబం ఇంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఈహెచ్ఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు తగిన విధంగా స్పందించలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ తరఫున ఈ అంశాన్ని ప్రశ్నించిన తర్వాతే ఈహెచ్ఎస్ అధికారులు స్పందించి పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులు, ఉద్యోగులు, పెన్షనర్లకు అత్యవసర వైద్యంలో భరోసా కల్పించాల్సిన ఈహెచ్ఎస్ వ్యవస్థలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# కంటి ఆపరేషన్‌పై నివేదిక పంపండి

- **జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిని నివేదిక కోరిన టీజీహెచ్ఆర్సీ**

**హైదరాబాద్, అక్టోబర్ 6,**

సిరిసిల్లకు చెందిన కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి బదులుగా కుడి కంటికి శస్త్రచికిత్స చేసినట్లు వచ్చిన వార్తా కథనాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీ హెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. ఈ ఆరోపణలు నిజమైతే వైద్య నిర్లక్ష్యం, రోగి భద్రత, శస్త్రచికిత్సకు సంబంధించి పొందిన సమ్మతి వంటి అంశాలపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతున్నాయని కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి నుంచి సమగ్ర నివేదికను కోరింది. రోగికి సంబంధించిన వైద్య రికార్డులు, సూచించిన, నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు, రోగి/కుటుంబ సభ్యుల నుంచి పొందిన సమ్మతి, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, నిర్వహించిన విచారణ వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. ఈ నివేదికపై నవంబర్ 6న విచారణ జరపనుంది



# నగరంలో రేపటినుంచి సారస్ మేళా

- **పది రోజులపాటు పల్లె ఉత్పత్తుల పండుగ**
- **20 రాష్ట్రాల నుంచి 200 పైగా స్టాళ్లు**
- **11న బతుకమ్మ వేడుకలు, హాజరు కానున్న మంత్రి సీతక్క**

**హైదరాబాద్, అక్టోబర్ 6 :**

నగర వాసులకు గ్రామీణ భారతీయ కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఒకే వేదికపై ఆస్వాదించే అవకాశం రానుంది. ఈనెల 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచఎండీఏ గ్రౌండ్స్‌లో సారస్ మేళా జరగనుంది. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ఈ మేళాను నిర్వహిస్తోంది. 20 రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ వేదికగా సారస్ నిలవనుంది. ఈసారి 200కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణకు చెందినవే 95 కాగా, ఇతర రాష్ట్రాలకు చెందినవి 100కు పైగా ఉన్నాయి. ఇవేకాక వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో 43 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి.

**ఒకేచోట తెలంగాణ చేనేతల అందం.. దేశీ రుచుల వైవిధ్యం**

మేళాలో అడుగుపెడితే తెలంగాణ పల్లెల సృజనాత్మకత నుంచి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతల వరకు ఒకే ప్రాంగణంలో కనిపించనున్నాయి. ఒక వైపు పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతల అందం.. మరోవైపు గ్రామీణ మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు.. ఇంకోవైపు పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు, సంప్రదాయ ఆహార పదార్థాలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. రాష్ట్రం నుంచి 32 హస్తకళల స్టాళ్లు, 20 చేనేత స్టాళ్లు, 30 ఆహార ఉత్పత్తుల స్టాళ్లు, 4 హెర్బల్ ఉత్పత్తుల స్టాళ్లు, 3 ప్రొడక్షన్ ఐటమ్స్, 6 లైవ్ ఫుడ్ స్టాళ్లు కలిపి మొత్తం 95 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. చెక్క బొమ్మలు, జూట్ బ్యాగులు, లెదర్ బ్యాగులు, మట్టి వస్తువులు, బంజారా కళాకృతులు, ఎంబ్రాయిడరీ, వివిధ ఆర్ట్ వర్క్స్‌తోపాటు పచ్చళ్లు, పొడులు, పిండి వంటలు, మిల్లెట్ ఆధారిత ఆహార ఉత్పత్తులు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

**22 రాష్ట్రాల గ్రామీణ ప్రతిభ**

రాష్ట్రంతోపాటు దేశంలోని 21 ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులతో పాల్గొంటున్నాయి. ఏపీ నుంచి 15 స్టాళ్లు, అండమాన్ నికోబార్ నుంచి 1, అసోం 1, బీహార్ 3, ఛత్తీస్‌గఢ్ 3, గోవా 2, గుజరాత్ 4, హిమాచల్‌ప్రదేశ్ 1, జమ్మూ కశ్మీర్ 1, కర్ణాటక 5, కేరళ 7, మధ్యప్రదేశ్ 1, మహారాష్ట్ర 6, మణిపూర్ 2, ఒడిశా 5, రాజస్థాన్ 7, సిక్కిం 1, తమిళనాడు 6, త్రిపుర 2, ఉత్తరప్రదేశ్ 2, ఉత్తరాఖండ్ 1, పశ్చిమబెంగాల్ 5 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. ఏర్పాటు చేస్తున్నారు. ఇక తెలంగాణతో పాటు ఇతర సంస్థల ఉత్పత్తులకు కూడా ప్రత్యేక స్థానం కల్పించారు. ఏఎలఈఏపీ ఆధ్వర్యంలో 4, మెప్మా 15, నాబార్డ్ 10, టీజీ హెచ్‌డీసీ (గోల్కొండ) 2, టీజీఎస్‌సీఓ 1, ట్రైఫెడ్ 2, విజయ డెయిరీ 1, వీ హబ్ 8 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

**పల్లె ఉత్పత్తికి పట్టణ మార్కెట్**

సారస్ మేళా గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణ వినియోగదారుల ముందుకు తీసుకెళ్లే మార్కెట్ అనుసంధాన వేదిక. తమ ఉత్పత్తులకు వినియోగదారుల నుంచి ఎలాంటి స్పందన వస్తున్నదో మహిళా పారిశ్రామికవేత్తలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది.



## భూకంపంతో ఉత్తరాఖండ్‌లో వణికిన భూమి

- **రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదు**
- **రాత్రి 10:30 గంటల సమయంలో ప్రకంపనలు**
- **ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాలకు వ్యాపించిన ప్రభావం**
- **ప్రాణ, ఆస్తి నష్టంపై ఇప్పటివరకు సమాచారం లేదు**

**డెహ్రాడూన్, అక్టోబర్ 6:**

ఉత్తరాఖండ్‌లో మంగళవారం రాత్రి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదైనట్లు సీస్మోలాజికల్ అధికారులు తెలిపారు. రాత్రి 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఖాదున్ లగా గవాలి ప్రాంతానికి సుమారు 22 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ప్రకంపనలు సంభవించిన సమయంలో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బహుళ అంతస్తుల భవనాలతో పాటు ఇళ్లలోని ఫ్యాన్లు, ఇతర వస్తువులు ఊగడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది.

**ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనూ ప్రకంపనలు**

భూకంప ప్రభావం ఉత్తరాఖండ్‌కే పరిమితం కాలేదు. ఢిల్లీఎన్‌సీఆర్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం లోతుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు.

**నష్టంపై కొనసాగుతున్న ఆరా**

భూకంపం కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. ప్రకంపనలకు సంబంధించిన మరిన్ని వివరాలను సీస్మోలాజికల్ విభాగాలు సేకరిస్తున్నాయి. పరిస్థితిని స్థానిక అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

## వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఆశుతోష్ దీక్షిత్

- **భారత వైమానిక దళానికి 29వ అధిపతిగా నియామకం**
- **అక్టోబర్ 31న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ నుంచి బాధ్యతల స్వీకరణ**
- **ప్రస్తుతం వైస్ చీఫ్‌గా.. దాదాపు నాలుగు దశాబ్దాల సేవా అనుభవం**
- **3,500 గంటలకు పైగా ఫైటర్ విమానాలపై ఫ్లయింగ్ అనుభవం**
- **ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సిందూర్‌లో కీలక అనుభవం**
- **పరమ విశిష్ట సేవా మెడల్ సహా పలు పురస్కారాలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**

భారత వైమానిక దళం కొత్త అధిపతిగా ప్రస్తుత వైస్ చీఫ్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఆయన వైమానిక దళానికి 29వ అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అదే రోజు మధ్యాహ్నం దీక్షిత్ బాధ్యతలు స్వీకరిస్తారు.

1986 డిసెంబర్ 6న ఫైటర్ స్ట్రీమ్‌లో చేరిన దీక్షిత్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. మిరాజ్ 2000, మిగ్ సిరీస్, జాగ్వార్, తేజస్ సహా వివిధ విమానాలపై 3,500 గంటలకు పైగా ఫ్లయింగ్ అనుభవం ఆయనకు ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, రక్షక్, సిందూర్ వంటి కీలక ఆపరేషన్లలోనూ పనిచేశారు.

మిరాజ్ 2000 స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్‌తో పాటు పలు ఫైటర్ ఎయిర్‌బేస్‌లు, కమాండ్లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ఇన్‌చీఫ్‌గా, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా పనిచేసిన ఆయన 2026 జూలై 1న వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎన్‌డీఏ పూర్వ విద్యార్థి అయిన దీక్షిత్ నేషనల్ డిఫెన్స్ కాలేజీలోనూ శిక్షణ పొందారు. ఆయన సేవలకు గుర్తింపుగా వాయుసేన మెడల్, విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్‌తో పాటు 2026లో పరమ విశిష్ట సేవా మెడల్ లభించింది.

## సేవాభావమే అసలైన సంపద

**హైదరాబాద్, అక్టోబర్ 6 :**

ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం ఒక పదవి కాదని, ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రూప్ 1 ద్వారా నియమితులై శిక్షణ పొందిన అనంతరం వివిధ జిల్లాలకు నూతనంగా నియమితులైన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్లు డి.మౌనికారాణి (నల్గొండ), సయ్యద్ యూసఫ్ ఆలీ(ఎంవి అండ్ ఎనల్గొండ), షగుఫ్తా ఫిర్‌దౌస్( వరంగల్) డి.సందీప్ కుమార్(సంగారెడ్డి), బొంగు మాధవ్( హైదరాబాద్ సౌత్), పి.దీపక్ (మహబూబ్‌నగర్) మంగళవారం నాడు సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా బాధ్యతతో పనిచేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ నేరుగా ప్రజల ఆస్తులు, భూములు, ఆర్థిక వ్యవహారాలతో ముడిపడి ఉన్నందున అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పని తీరుతోనే మీకు మంచి పేరు వస్తుంది.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవా దృక్పథంతో పనిచేయండి.. మీ కెరీర్‌లో డబ్బు ఒక్కటే ప్రధానం కాదు.. మీపై ప్రజలకు ఉండే నమ్మకం, మీ క్రెడిబిలిటీనే మీకు అసలైన సంపద అని మంత్రి వారికి సూచించారు. నిజాయతీగా, పారదర్శకంగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, నిబంధనల పరిధిలో వేగంగా పరిష్కారాలు చూపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు గౌరవంగా, సహాయకారిగా వ్యవహరించాలన్నారు.



## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ 'ఇండి' కూటమి నిరసన

- **నీతి ఆయోగ్ సమీపంలో అడ్డుకున్న పోలీసులు**
- **పలువురు నేతల నిర్బంధం**
- **ఆకాశవాణి భవన్‌లో రాహుల్, ప్రియాంక బైఠాయింపు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 'ఇండి' కూటమి ఎంపీలు మంగళవారం చేపట్టిన మార్చ్ ఉద్రిక్తతకు దారితీసింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నిర్వాచన్ సదన్‌కు బయలుదేరిన ఎంపీలను నీతి ఆయోగ్ఆకాశవాణి భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో ప్రతిపక్ష నేతలు రోడ్డుపైనే బైఠాయించారు. పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి వెళ్లి నిరసన కొనసాగించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఎన్నికల కమిషన్ పనితీరుపై అభ్యంతరాల నేపథ్యంలో ఇండియా కూటమి ఈ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఉదయం సుమారు 11 గంటలకు పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎంపీలు బయలుదేరారు. పార్లమెంట్, నిర్వాచన్ సదన్ పరిసరాల్లో ముందుగానే భారీగా భద్రతా బలగాలను మోహరించి, మార్గమధ్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలిపారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్, ఎన్సీపీశరద్ పవార్ వర్గం ఎంపీ సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాయి.పోలీసులు మార్చ్‌ను నిలిపివేయడంతో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ బారికేడ్లపైకి ఎక్కారు. ప్రియాంక గాంధీని పోలీసులు బస్సులోకి తీసుకెళ్లగా కొద్దిసేపటికి ఆమె కిందికి దిగి రాహుల్‌తో కలిశారు. అనంతరం రాహుల్, ప్రియాంక, దీపేందర్ హుడా ఆకాశవాణి భవన్ రిసెప్షన్ గేటు ద్వారా ప్రాంగణంలోకి ప్రవేశించారు. అక్కడ చెట్టు కింద కూర్చొని, ఎన్నికల కమిషన్ కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని పోలీసులు కోరినా వారు నిరసన కొనసాగించారు.మరోవైపు అఖిలేశ్ యాదవ్, అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ తదితరులను పోలీసులు బస్సుల్లో తరలించారు. రాహుల్‌తోపాటు కొందరు ఎంపీలను కొద్దిసేపు నిర్బంధించి విడుదల చేసారు.ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఓట్ల అక్రమాలకు బాధ్యులైనవారు జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేరన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమతో 300 మంది ఎంపీలు వచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళనపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తూ దేశంలో అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని పార్టీ ప్రతినిధి సంబిత్ పాత్ర ఆరోపించారు. ఎన్నికల పరాజయాలపై అసంతృప్తితో ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య సంస్థలను అప్రతిష్ఠపాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రతిపక్షాలు ప్రకటించాయి. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం 8 వరకు జిల్లాస్థాయి పాదయాత్రలు, 10 నుంచి 20 వరకు బ్లాక్ స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 25 నుంచి నవంబర్ 25 వరకు సభలు చేపట్టనున్నారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అభ్యంతరాలను వివరించేందుకు అక్టోబర్ రెండో వారంలో రాష్ట్రపతిని కలిసేందుకు సమయం కోరనున్నట్లు కూటమి తెలిపింది.

## సర్‌పై పిటిషన్లకు సుప్రీంకోర్టులో కీలక విచారణ

- **సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిల్‌పై ఈనెల 27న విచారణ**
- **ఈసీ నిర్ణయాలన్నింటినీ పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు**
- **• ట్ట విరుద్ధమైతే నిర్ణయాలను కొట్టివేస్తామని స్పష్టీకరణ**
- *** ఫారమ్-6లో మార్పులు ఎవరు చేశారో పరిశీలిస్తామన్న ధర్మాసనం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:**

ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్న వేళ.. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై అక్టోబర్ 27న విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, సీఈసీకి ఇప్పటికే నోటీసులు జారీ చేసింది.

**ఈసీ నిర్ణయాలపై సమీక్ష**

ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ఈసీ పలు నిర్ణయాలు తీసుకుందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏ నిర్ణయం చట్టానికి విరుద్ధంగా ఉన్నట్లు తేలినా దానిని కొట్టివేస్తామని పేర్కొంది.

**ఫారమ్-6పై స్పష్టత కోరిన ధర్మాసనం**

సర్‌లో ఉపయోగిస్తున్న ఫారమ్ 6లో మార్పులు చేశారన్న అంశం రాజకీయ వివాదానికి దారి తీసింది. అయితే ఫారమ్ 6లో ఒక్క కామా, ఫుల్‌స్టాప్ కూడా మార్చలేదని ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. సర్ ఫారమ్ 6కు అదనంగా ఒక డిక్లరేషన్ మాత్రమే జత చేసినట్లు తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టు.. ఫారమ్ 6లో మార్పులు ఎవరు చేశారనే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది. తాము ఫారమ్ 6లో ఎలాంటి మార్పులను ఆమోదించలేదని స్పష్టం చేసింది.

**సీఈసీపై చర్యలకు పిటిషనర్ల డిమాండ్**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ తదుపరి నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకోవడంతో పాటు ఆయనను సస్పెండ్ చేయాలని పిటిషనర్లు మధ్యంతర ఉత్తర్వులు కోరారు. దీనిపై ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని సస్పెండ్ చేస్తే దేశంలో ఎన్నికలను ఎవరు నిర్వహిస్తారని ప్రశ్నించింది.

## అఫ్జల్ గురు కుటుంబం అక్రమ నిర్మాణం కూల్చివేత

- **బారాముల్లాలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్డు ధ్వంసం**
- **బుల్డోజర్లతో నిర్మాణాన్ని తొలగించిన అధికారులు**
- **నిబంధనలు ఉల్లంఘించినందుకే చర్యలు తీసుకున్నట్లు వెల్లడి**
- **2001 పార్లమెంట్ దాడి కేసులో దోషిగా తేలిన అఫ్జల్ గురు**

**శ్రీనగర్, అక్టోబర్ 6:**

పార్లమెంట్‌పై దాడి కేసులో దోషిగా తేలిన ఉగ్రవాది మహ్మద్ అఫ్జల్ గురు కుటుంబానికి చెందిన నిర్మాణాన్ని జమ్మూ కశ్మీర్ అధికారులు మంగళవారం బుల్డోజర్లతో కూల్చేశారు. బారాముల్లా జిల్లాలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్డును తొలగించినట్లు అధికారులు తెలిపారు. సోపోర్ ప్రాంతంలోని వరద ప్రభావిత భూమిలో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

**ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం**

అఫ్జల్ గురు కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డును నిర్మించి అందులో నివాసం ఉంటున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి నిర్మాణాన్ని కూల్చివేశారు.



**2013లో అఫ్జల్ గురుకు ఉరిశిక్ష**

2001లో జరిగిన పార్లమెంట్ దాడి కేసులో అఫ్జల్ గురు దోషిగా తేలాడు. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో అతడికి సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సుప్రీంకోర్టు అతడికి ఉరిశిక్షను ఖరారు చేయగా.. 2013లో శిక్ష అమలు చేశారు.

## ఢిల్లీ పోలీసుల అదుపులో రాహుల్, పలువురు ప్రతిపక్ష నాయకులు

- **అరెస్టును ఖండించిన సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6 :**

సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు నుండి భారత ఎన్నికల సంఘం(సీఈసీ) ప్రధాన కార్యాలయం వైపు మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అయితే భారీ ప్రదర్శనకు అనుమతి లేకపోవడం, శాంతిభద్రతల సమస్యలను కారణంగా చూపుతూ ఢిల్లీ పోలీసులు ఆకాశవాణి భవన్ సమీపంలో ప్రదర్శనను అడ్డుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉద్యమం ఒక సాధారణ రాజకీయ పోరాటం కాదని, రాజ్యాంగాన్ని కాపాడటానికి, పారదర్శక ఓటింగ్ హక్కులను నిర్ధారించడానికి చేస్తున్న పోరాటమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**రాహుల్ పోరాటానికి వణుకుతున్న కేంద్ర ప్రభుత్వం : సీఎం రేవంత్ రెడ్డి**

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అస్తవ్యస్తంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ రద్దు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పార్టీ విశ్రమించబోదని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన 'సర' రద్దు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటు బచావో.. దేశ్ బచావో(ఓటును రక్షిద్దాం.. దేశాన్ని రక్షిద్దాం) ఉద్యమంలో భాగంగా అహింసాయుతంగా ఆందోళన చేస్తున్నరాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్, ఇండి కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య, చట్ట విరుద్ధమైన ఈ అరెస్టులు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనూ స్వల్ప కారణాలకే మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి నేతలను నాటి వలస ప్రభుత్వం అరెస్టు చేసేదని, ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ(బీజేపీ) కూడా అలానే రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని సీఎం విమర్శించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని సీఎం అన్నారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును రక్షించుకునేందుకు ప్రజలు, యువత రాహుల్ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని హెచ్చరించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు, లాఠీచార్జిలు కాంగ్రెస్, ఇండి కూటమి చేస్తున్న ఉద్యమాన్ని అణచివేయలేవని, తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తాయని సీఎం తెలిపారు.



**అరెస్టులు అప్రజాస్వామికం : మంత్రి పొంగులేటి**

ఓట్ల చోరీ, ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్‌ల అరెస్టులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. అరెస్టులు, లాఠీచార్జిలు, కేసులతో ఓట్ల చోరీపై కాంగ్రెస్ పోరాటాన్ని అణచలేరని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన తప్పిదాలకు బాధ్యత వహించి రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదన్నారు.

# కూకట్‌పల్లిలో 'టౌన్ ప్లానింగ్' తమాషా!

- అక్రమార్కుల ఆగడాలు.. అధికారుల అండదండలు
- శక్తి నగర్ జే పి నగర్ లలో అక్రమ నిర్మాణాలు
- మామూళ్ల మత్తులో అధికారులు..!





**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** "అధికారులందరినీ కొనేశాం.. ఎవ్వడూ మా ఒక్క ఇటుక కూడా పీకలేడు!" — ఇది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విచ్చలవిడిగా నిబంధనలను కాలరాస్తున్న ఓ అక్రమ నిర్మాణదారుడి బరితెగింపు మాట! కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ సర్కిల్ పరిధిలోని శక్తి నగర్, జేపీ నగర్ కాలనీలలో నిబంధనలకు పాతర వేస్తూ రెండు భారీ అక్రమ కట్టడాలు ఆకాశమే హద్దుగా యథేచ్ఛగా వెలుస్తున్నాయి. పేరుకు మాత్రమే అరకొర అనుమతులు పొంది, క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి నిలువునా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్నా స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కళ్లముందే బహుళ అంతస్తుల భారీ భవనాలు నిర్లజ్జగా లేస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారుల కళ్లకు ఇవేవీ కనిపించడం లేదా? లేక మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. 'మనల్ని ఆపే మొనగాడు లేడు' అంటూ సదరు బిల్డర్ బాహాటంగానే ప్రగల్భాలు పలుకుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తుండటం ఆయన వెనుక ఉన్న పలుకుబడిని, అధికారుల లాలూచీ తనాన్ని స్పష్టం చేస్తోంది. అగ్నిమాపక భద్రత, సరైన సెట్‌బ్యాక్‌లు లేకుండా సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాల వల్ల రానున్న రోజుల్లో తీవ్రమైన డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఎద్దడితో పాటు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అక్రమార్కుల జేబులు నింపే పనిలో పడ్డ అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ బృందాలు తక్షణమే స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాయా, లేక బిల్డర్ అన్నట్లే అధికారులు అమ్ముడుపోయారని సరిపెట్టుకోవాలా అన్నది వేచి చూడాల్సిందే.

# దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- కొండపల్లి శ్రీధర్ రెడ్డి
- దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి: శ్రీధర్ రెడ్డి డిమాండ్




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' లో భాగంగా పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు సమాజంలో ఎవరికీ తీసిపోరని, సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటగలరని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబన కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కేంద్రం అందిస్తున్న పథకాలు, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

**ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ఆ హామీని విస్మరించడం బాధాకరమని శ్రీధర్ రెడ్డి విమర్శించారు."దివ్యాంగులు ఎవరి దయాదాక్షిణ్యాల కోసం ఎదురుచూడకూడదు. వారు కూడా గౌరవంగా, ఆత్మగౌరవంతో జీవించే హక్కు కలిగిన పౌరులు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ను వెంటనే రూ.6,000 కు పెంచాలి. పెన్షన్ పెంచే వరకు దివ్యాంగుల పక్షాన బీజేపీ పోరాడుతుంది, అవసరమైతే దివ్యాంగులతో కలిసి ఉద్యమం చేస్తాం" అని స్పష్టం చేశారు.దివ్యాంగుల కష్టాలను రాజకీయ లెక్కలుగా కాకుండా మానవీయ కోణంలో ప్రభుత్వం చూడాలని, వారి కన్నీళ్లు తుడిచే వరకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం శ్రీధర్ రెడ్డి దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, స్వయంగా స్వల్పాహారాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షత వహించగా, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెలంగాణ చైర్మన్ చలమయ్య, బీజేపీ జిల్లా నాయకులు నున్న రవికుమార్, అనంత ఉపేందర్ గౌడ్, కోటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల కోసం 60 రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

– ఆదివాసి గిరిజన అభ్యర్థులకు సువర్ణావకాశం.

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాకి చెందిన అర్హులైన ఆదివాసి, గిరిజన యువతీ యువకులకు పీసీ, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధం చేసేందుకు తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (పివిటిజి-చెంచు) మన్ననూర్ ఆధ్వర్యంలోఉచిత భోజన వసతితో కూడిన శిక్షణ తరగతులునిర్వహించడం జరుగుతుంది. ఆసక్తి గల గిరిజన యువతి యువకులు ఇట్టి ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోగలని సలోని ఛబ్రా ఐ.ఏ.యస్, ప్రాజెక్ట్ అధికారి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (పివిటిజి-చెంచు) మన్ననూర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు, ఎంపికైన అభ్యర్థులకు సుమారు 2నెలల పాటు ప్రిలిమ్స్ పరీక్ష తేదీ వరకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నారు.

**అర్హతలు:** అభ్యర్థులు రూ.3 లక్షల ఆదాయ పరిమితికి సంబంధించిన ఇన్‌కమ్ సర్టిఫికెట్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసిన పత్రం సమర్పించాలి. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు.

**ముఖ్యమైన తేదీలు**

- దరఖాస్తుల ప్రారంభం: 05-10-2026
- దరఖాస్తుల చివరి తేదీ: 09-10-2026 సాయంత్రం 5.00 గంటల వరకు.
- స్క్రీనింగ్ టెస్ట్: 15-10-2026
- జాబితా విడుదల: 16-10-2026.
- సర్టిఫికెట్ వెరిఫికేషన్: 17-10-2026.
- తుది ఫలితాలు: 19-10-2026
- తరగతుల ప్రారంభం: 21-10-2026

ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వారి కార్యాలయం, వికారాబాద్ లో సంప్రదించి దరఖాస్తు ఉచితంగా పొంది సమర్పించలన్నారు. మరిన్ని వివరాల కొరకు ఫోన్ నం.9010487700 సంప్రదించలని తెలిపారు.

# వికారాబాద్ పట్టణంలో విస్తృతస్థాయి తనిఖీలు

- శాంతిభద్రతల పరిరక్షణ సాంఘిక కార్యకలాపాల నియంత్రణ
- నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణ లక్ష్యంగా మంగళవారం వికారాబాద్ పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెల్లవారుజామున 05:00 గంటలకు ప్రారంభించి ఉదయం 08:30 గంటల వరకు సుమారు ఐదు గంటల పాటు విస్తృతంగా నిర్వహించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్వయంగా పాల్గొని కాలనీ వాసులతో మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతాయుతంగా, శాంతియుతంగా, మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడే వారు, రౌడీషీటర్లు ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలతో నేరుగా సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు లేదా అసాంఘిక చర్యలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు సురక్షితమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, నేరాలకు సంబంధం ఉన్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరి అయిన పత్రాలు లేని మొత్తం 50 ద్విచక్ర వాహనాలు, 01 ఆటోను అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో 35 క్వార్టర్ మద్యం సీసాలు, 09 బీర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యానికి హానికరంగా ఉండే కల్తీ ఆహార పదార్థాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి గుట్కా, మీరాజ్, కల్తీ ఆయిల్, రసగుల్లాలు, కల్తీ పాపడ్లు, కల్తీ చకోడీలు తదితర ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలకు చర్యలు చేపట్టారు. కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం ద్వారా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరించారు.కాలనీలలో నేరాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, డీఏఆర్ సిబ్బంది, క్యూ.ఆర్.టి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 85 మంది పోలీస్ అధికారులు సిబ్బంది ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన 44వ డివిజన్ నాయకులు

నూతి సత్యనారాయణ గౌడ్ కు ఘన సన్మానం..
మాచర్ల తిరుమలరావుకు శుభాకాంక్షలు




**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ను 44వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.44వ డివిజన్ నాయకులు గుడిపూడి జగదీష్ ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు కలిసి నూతి సత్యనారాయణ గౌడ్ ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన మాచర్ల తిరుమలరావును నాయకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ మైనారిటీ నాయకులు షేక్ హుసేన్ తో పాటు పలువురు కాంగ్రెస్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## రంగంపేటలో మద్యం సిగరెట్ గుట్కా నిషేధం

సర్పంచ్ షేక్ సలేహ సుల్తానా పైజొద్దీన్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రంగంపేట గ్రామంలో సర్పంచ్, వి డి సి సభ్యులు వినత్న నిర్ణయం తీసుకున్నట్లు రంగంపేట గ్రామ సర్పంచ్ షేక్ సలేహా సుల్తానా పైజొద్దీన్ తెలిపారు, గ్రామంలో మద్యం, సిగరెట్, గుట్కా నిషేధిస్తూ తీర్మానం చేశారు, గ్రామంలో ఎవరైనా మద్యం, గుట్కా, సిగరెట్ అమ్మ రాదని, బహిరంగ ప్రదేశాలలో మద్యపానం, సిగరెట్ ఎవరు తాగారాదని, త్రాగిన యెడల 5000 రూపాయల జరిమానా విధిస్తామని ప్రత్యేక గ్రామ సభలు తీర్మానం చేశారు, ఈ నిర్ణయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానం టెండర్ ప్రకటన

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఈసన్నపల్లి, రామారెడ్డి గ్రామాలలో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానంలో సమస్త గ్రామ ప్రజలకు, భక్తులకు, వ్యాపారస్తులకు తెలియజేయునది టెంకాయలు, పూజ సామాగ్రి, కూల్ డ్రింక్స్, పూసవేర్లు, దుకాణము టెండర్ ప్రకటన చేయుటకు తేదీ 8-10-2026 గురువారం రోజున ఉదయం 11 గంటలకు దేవాలయ బహిరంగ వేలం నిర్వహించబడును వేలంలో పాల్గొనేవారు పదివేల రూపాయలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవలసిందిగా ఆలయ ఈవో ప్రభు రామచంద్రం తెలిపారు.

## లడ్డు పులిహోర ప్రసాదములు బహిరంగ వేళము



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చుక్కాపూర్ నందు దేవాదాయ శాఖ పర్యవేక్షకులు సత్యనారాయణ పర్యవేక్షణలో రెండు సంవత్సరాల కాలపరమితికి గాను లడ్డు పులిహోర ప్రసాదములు అమ్ముకొనుటకు బహిరంగ వేళము నిర్వహించబడినది. ఇట్టి వేలం పాటలో లక్ష్మీ నరసింహులు కూడవెల్లి వాస్తవ్యులు 26 లక్షల 50 వేల రూపాయలకు గాను హెచ్చు పాటదారుగా వేలం పాటను దక్కించుకున్నారు గత సంవత్సరం 17 లక్షల 20వేల రూపాయలు కాగా. గత సంవత్సరం కంటే తొమ్మిది లక్షల 30 వేల రూపాయలు ఎక్కువగా వచ్చినవి . ఇట్టి కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా ,అభివృద్ధి కమిటీ చైర్మన్ శనిగరం కమలాకర్ రెడ్డి ,సభ్యులు రాజారెడ్డి, లక్ష్మీరాజం,దేవయ్య ,ఆంజనేయులు ఆలయ అర్చకులు సిబ్బంది వివిధ గ్రామాలలో నుండి వచ్చిన వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## వన్యప్రాణి సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**తాండూర్, రాజముద్ర న్యూస్:** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో తాండూర్ లోని విద్యా భారతి పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అటవీ, వన్యప్రాణి సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణులతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి ,



# సామాజిక జీవితాన్ని అక్షరబద్ధం చేసిన యశోదారెడ్డి

## నేడు పాకాల యశోదారెడ్డి వర్ధంతి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచు కున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షు రాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి. యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 – అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న మహబూబ్ నగర్ జిల్లా (ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు" అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాషతో కూడా పరిచయమున్నది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయ వంతం అయ్యేందుకు దోహద పడేది. 1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920–40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చమ్మ కథలు (1999) 1950–70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980–1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు. యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణ మాండలిక నుడి కారానికి అద్దం పడతాయి. ఎచ్చమ కథలకు ముందుమాటలో "ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూల ధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు. యశోదారెడ్డి కథారచయిత్రి గానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ' ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు.ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# విశ్వమానవ ఉత్సవం.. ప్రపంచ పత్తి దినోత్సవం

- తెల్ల బంగారం... రైతు శ్రమకు గ్లోబల్ గౌరవం
- నేడు ప్రపంచ పత్తి దినోత్సవం



ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఫీూూ) ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు, మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదు; అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం. ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం పత్తి పంట యొక్క ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత, ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన



ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలు పత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి.

భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తి సాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360--400 లక్షల గింజల బేళ్ల (ఖ్రీవం) ఉత్పత్తి అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. "మేడ్ ఇన్ ఇండియా కాటన్" అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తి పంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగా ఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన "కాటన్–4" ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాడ్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాలు పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. "కాటన్ ఈజ్ లైఫ్" అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది.

భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగా ఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ "రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ–ఈ అన్నీ కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి." అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదు; అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రపంచవ్యాప్తంగా శ్రామికుల చైతన్యం..

**మంచి పని కోసం ప్రపంచ దినోత్సవ సందేశం**

**నేడు మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం**



ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం శ్రామికుల హక్కులు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం, సమాన అవకాశాలు, న్యాయపరమైన వేతనం, సామాజిక భద్రత వంటి అంశాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తించడానికి, ప్రోత్సహించడానికి, శ్రామికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రత్యేక వేదికగా మారింది. ఇది కేవలం ఒక సాంప్రదాయ, గుర్తింపు రోజు మాత్రమే కాదు. ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకునే, చైతన్యం పెంచే, సమాజంలో సమానత్వం, న్యాయం, శాంతి మరియు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి ముఖ్యమైన ఒక వేదిక.

మంచి పని అంటే కేవలం జీతం పొందే అవకాశం మాత్రమే కాదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం, ఇది వ్యక్తికి సామాజిక గౌరవం, భద్రత, వృత్తిపరమైన అభివృద్ధి, జీవన ప్రమాణాలను మెరుగుపరచే అవకాశాలను కల్పించే పని పరిస్థితులను సూచిస్తుంది. మంచి పని లక్షణాల్లో సరసమైన వేతనం, పని స్థలంలో హక్కులు, సామాజిక భద్రత, భద్రత కలిగిన పని వాతావరణం, సమాన అవకాశాలు ముఖ్యంగా ఉంటాయి. సరసమైన వేతనం అంటే పనికి తగిన, గౌరవంగా జీవించడానికి సరిపడే వేతనం; పని హక్కులు అంటే యూనియన్లలో చేరే, సమిష్టి బేరసారాలు చేసుకునే హక్కుతో పాటు ప్రాథమిక హక్కులను గౌరవించడం; సామాజిక భద్రత అంటే ఆరోగ్య సంరక్షణ, పెన్షన్, సెలవులు, ప్రసూతి సెలవులు వంటి రక్షణలను కల్పించడం; పని భద్రత అంటే సురక్షితమైన, ప్రమాదము లేనిది,



ఆరోగ్యకరమైన వాతావరణం; సమాన అవకాశాలు అంటే లింగం, జాతి, మతం ఆధారంగా వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశం కల్పించడం.

ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవం 2008లో అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమై, శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాజంలో సమానత్వం, ఆర్థిక వృద్ధికి పునాదులు వేయడానికి కీలకంగా మారింది. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో శ్రామికుల సమస్యలు, నూతన శ్రామిక విధానాలు, భద్రతా మార్గదర్శకాలు, యువ శ్రామికుల పరిస్థితులు, స్త్రీ శక్తి ఉద్యోగాల్లో సమన్వయం వంటి అంశాలను చర్చిస్తారు. ప్రధానంగా శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాన జీతాలు, పని వేళల నియంత్రణ, స్త్రీ–పురుషుల సమాన అవకాశాలు, సురక్షిత పని వాతావరణం, ప్రమాదాల నివారణ, వృత్తిపరమైన గుర్తింపు, ఉద్యోగ సంఘాల మద్దతు, ఆర్థిక స్థిరత్వం, సమాజంలో సమానత్వం వంటి అంశాలను ప్రాధాన్యం ఇస్తారు. ఈ విధంగా ప్రతి పని స్థలం వ్యక్తులకు గౌరవప్రదమైన, భద్రత కలిగిన, సమానత్వంతో కూడిన పని పరిస్థితులను కల్పించ గలుగుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌తో ఈ రోజును జరుపుకుంటారు. దీని ద్వారా శ్రామికులు మరియు కార్మిక సంఘాలు శాంతి, ప్రజాస్వామ్యం, సమానత్వం, భద్రత కలిగిన పని స్థలాలను సృష్టించడంలో తమ కృషిని కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటారు. భారత దేశంలో, అనధికారిక రంగంలో పనిచేసే శ్రామికులు, మహిళా శ్రామికులు, యువ శ్రామికులు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం భారతదేశంలో కూడా శ్రామికుల హక్కుల పరిరక్షణకు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం సృష్టించడానికి ఒక ముఖ్యమైన వేదికగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2.78 మిలియన్ల మంది శ్రామికులు పని సంబంధిత గాయాలు, వ్యాధుల కారణంగా మరణిస్తారు. 374 మిలియన్ల మంది గాయపడ్డారు. ఈ గణాంకాలు శ్రమ భద్రతా మార్గదర్శకాలు, శ్రామిక హక్కుల పరిరక్షణ, సురక్షిత పని వాతావరణం అవసరాన్ని స్పష్టంగా చూపుతాయి. మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం శ్రామికులు జీవన ప్రమాణాలను పెంచే, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడంలో, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలకంగా మారింది. ఇది ప్రతి వ్యక్తి, ప్రతి సమాజం, అంతర్జాతీయ స్థాయిలో సమానమైన, భద్రత కలిగిన, గౌరవ ప్రదమైన పని పరిస్థితులను సాధించే పునాదిని సృష్టిస్తుంది. ఈ సందర్భం ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకోవడానికి గొప్ప అవకాశం. మన సమాజం, వృత్తిపరంగా ఎదుగుతున్న ప్రతి వ్యక్తి ఈ దినోత్సవం ద్వారా మంచి పని, సమానత్వం, భద్రత మరియు గౌరవం కోసం చురుకుగా కృషి చేయాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పిన హర్మన్‌ప్రీత్ కౌర్

**ముంబై, అక్టోబర్ 5 :** భారత మహిళల క్రికెట్ జట్టు సీనియర్ ప్లేయ ర్ హర్మన్‌ప్రీత్ కౌర్.. కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పారు. నాయకత్వ బాధ్యతల నుంచి తప్పు కుంటున్నట్లు ఆమె ప్రకటించారు. అన్ని ఫార్మాట్ల పగ్గాలను వదిలేసినట్లు ఆమె తెలి పారు. 2025లో ఇండియాకు వన్డే వరల్డ్‌కప్ అందిచిన హర్మన్‌ప్రీత్.. కెప్టెన్‌గా చే శారు. భారత జట్టుకు అతి సుదీర్ఘ కాలం కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్లేయ ర్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది. కౌర్ తప్పుకోవడంతో ఇక వైస్ కెప్టెన్ స్మృతి మందానా లీడర్‌షిప్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కెప్టెన్సీ నుంచి తప్పుకోనున్న హర్మన్‌ప్రీత్ ఇక నుంచి ఎక్కువగా బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. తాను తీసుకున్న నిర్ణయం సులువైంది కాదు అని, ఇది ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలు, భావోద్వేగాలు, త్యాగాల ఫలితం అని ఆమె అన్నారు. ప్రస్తుతం హర్మన్‌ప్రీత్ వయసు 37 ఏళ్లు. ఆమె అయిదు టెస్టులు, 51 వన్డేలు, 155 టీ20లకు కెప్టెన్‌గా న్నారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఆమె తన కెప్టెన్సీ వీడ్కోల ప్రకటన చేసింది. తాజాగా ముగిసిన ఆసియా గేమ్స్‌లో.. హర్మన్ నేతృత్వంలోని భారత జట్టు గోల్డ్ మెడల్ కొట్టిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితమే గౌహతిలో బీసీసీ కార్యదర్శి దేవజిత్ సైకియాతో హర్మన్, స్మృతి, అమోల్ మజుందార్ కలిసిన విషయం తెలిసిందే. నాయకత్వ బాధ్యతలను త్యజించినా.. తన క్రికెట్ జర్నీ కొనసాగుతుందని, బ్యాటింగ్‌పై ఫోకస్ పెట్టనున్నట్లు ఆమె చెప్పారు.

# 2036 ఒలింపిక్స్ కోసం ఏడుగురి పోటీ!



- ఆతిథ్య రేసులో భారత్‌తోపాటు మరో ఆరు దేశాలు
- అక్టోబర్ 31తో కొత్త ఆసక్తి ప్రతిపాదనలకు గడువు
- నవంబర్‌లో ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు ప్రాజెక్టుల ప్రజెంటేషన్
- 2027 మార్చిలో తొలి వడపోత.. తదుపరి దశకు ఎంపిక
- 2029 మధ్యలో 2036 విశ్వక్రీడల వేదికపై తుది నిర్ణయం



**లాసాన్, అక్టోబర్ 6 :** 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణ హక్కుల కోసం భారత్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది. భారత్‌తోపాటు జర్మనీ, హంగేరి, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే ప్రస్తుతం ఆతిథ్య రేసులో ఉన్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ మంగళవారం వెల్లడించింది. ఈ ఏడు దేశాలు ప్రస్తుతం ఐఓసీతో ప్రాథమిక చర్చల దశలో ఉన్నాయి. 2036 విశ్వక్రీడల ఆతిథ్య ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఐఓసీ కొత్త రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. ప్రస్తుతం ప్రకటించిన ఏడు దేశాలతోపాటు కొత్తగా ఆసక్తి చూపే దేశాలకు అక్టోబర్ 31 వరకు అవకాశం ఉంది. ఆ తర్వాత 2036 క్రీడల కోసం కొత్త ఆసక్తి ప్రతిపాదనలను స్వీకరించబోమని ఐఓసీ స్పష్టం చేసింది.

## నవంబర్‌లో తొలి పరీక్ష

ఆతిథ్య రేసులో ఉన్న దేశాలు నవంబర్‌లో ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు తమ ఒలింపిక్స్ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రజెంట్ చేయనున్నాయి. క్రీడా వేదికల మాస్టర్ ప్లాన్, క్రీడాకారులకు కల్పించే సౌకర్యాలు, నిధుల సమీకరణ, ప్రభుత్వ-ప్రజా మద్దతు, నిర్వహణ సామర్థ్యం, క్రీడల అనంతరం మౌలిక సదుపాయాల వినియోగం వంటి అంశాలను ఐఓసీ పరిశీలించనుంది. ఈ ప్రజెంటేషన్ల తర్వాత సాధ్యాసాధ్యాలపై సమగ్ర అంచనా చేపడతారు. 2027 మార్చిలో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆసక్తి చూపుతున్న దేశాల్లో కొన్నింటిని తదుపరి 'స్ట్రాటజిక్ డైలాగ్' దశకు ఎంపిక చేయనుంది. అక్కడి నుంచి ఆయా ప్రతిపాదనలపై మరింత లోతైన పరిశీలన కొనసాగుతుంది.

## భారత్‌కు ఇదే తొలి అవకాశం

భారత్ ఇప్పటివరకు ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వలేదు. భారత ఒలింపిక్ సంఘం 2024 అక్టోబర్ 1న 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ నిర్వహణపై ఐఓసీకి ఆసక్తి లేఖ సమర్పించింది. ప్రస్తుతం భారత ప్రతిపాదన ఫ్యూచర్ హోస్ట్ కమిషన్‌తో చర్చల దశలో ఉంది. అహ్మదాబాద్‌ను



ప్రధాన కేంద్రంగా చేసుకుని భారత్ తన ఆతిథ్య ప్రణాళికను ముందుకు తీసుకెళ్తోంది.

## 2029లో తేలనున్న వేదిక

ఐఓసీ కొత్త ప్రక్రియ ప్రకారం 2028 చివర్లో అనుకూలమైన ప్రతిపాదనలతో లక్ష్యిత చర్చలు ప్రారంభమవుతాయి. చివరకు 2029 మధ్యలో జరిగే ఐఓసీ సమావేశంలో 2036 ఒలింపిక్స్ ఆతిథ్యంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్, 2032 క్రీడలకు బ్రిస్బేన్ ఇప్పటికే ఆతిథ్య నగరాలుగా ఖరారయ్యాయి.







# పాకిస్థాన్ క్రికెట్‌కు బిగ్ షాక్

## సగం ధరకే ప్రసార హక్కుల విక్రయం!

ఇస్లామాబాద్, అక్టోబర్ 6 : ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు (పీసీబీ) ప్రసార హక్కుల విషయంలో కోలుకోలేని దెబ్బ తగిలింది. తమ సొంత గడ్డపై జరగనున్న 25 అంతర్జాతీయ మ్యాచ్‌ల మీడియా ప్రసార హక్కులను పీసీబీ నిర్దేశించిన రిజర్వ్ ధరలో సగానికంటే తక్కువ ధరకు విక్రయించాల్సి వచ్చింది. ప్రసార హక్కుల వేలంలో కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'పాకిస్థాన్ టెలివిజన్ కార్పొరేషన్' (పీటీవీ) మాత్రమే ఏకైక బిడ్డర్‌గా నిలవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో పీసీబీ ఆశించిన రూ. 600 మిలియన్ల రిజర్వ్ ధరకు బదులుగా కేవలం రూ. 350 మిలియన్లకే హక్కులను పీటీవీ దక్కించుకుంది. తాజా ఒప్పందంలో పాకిస్థాన్ స్వదేశంలో ఆడే 5 టెస్టులు, 14 వన్డేలు, 6 టీ20లు కలిపి మొత్తం 25 మ్యాచ్‌లు ఉన్నాయి. ఇందులో ఈ నెలలో శ్రీలంకతో జరగనున్న టీ20, త్రైపాక్షిక వన్డే సిరీస్, రెండవ విడత టెస్టు సిరీస్‌లతో పాటు 2027 జనవరి వరకు జరగబోయే అంతర్జాతీయ మ్యాచ్‌లు చేరి ఉన్నాయి. ఈసారి గతంలో మాదిరిగా బ్రాడ్‌కాస్టర్లు కన్సార్టియంగా ఏర్పడి బిడ్డింగ్‌లో పాల్గొనడాన్ని పీసీబీ అనుమతించకపోవడం, మరోవైపు గతంలో హక్కులు దక్కించుకున్న సంస్థలు బిలియన్ల కొద్దీ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రధాన ప్రసార సంస్థలన్నీ టెండర్‌కు దూరంగా ఉండిపోయాయి. పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు ఇటీవలి కాలంలో అత్యంత పేలవ ప్రదర్శన కనబరుస్తుండటంతో స్పాన్సర్లు, ప్రకటనదారులు ఆ దేశ క్రికెట్‌పై ఆసక్తి చూపకపోవడం కూడా ఈ పరిస్థితికి మూలకారణంగా మారింది. కేవలం అంతర్జాతీయ సిరీస్‌లే కాకుండా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్11) ప్రసార హక్కులకు కూడా ఆశించిన మేర స్పందన రాలేదని సమాచారం. మ్యాచ్‌ల హక్కులు సగం ధరకు పడిపోవడంతో పీసీబీ రాబడిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనుంది.

# అయ్యర్ శివమెత్తాడు.. భారత్ బోణీ కొట్టింది!

- తొలి టీ20 శతకంతో చెలరేగిన టీమిండియా కెప్టెన్
- 43 బంతుల్లో అజేయంగా 102.. పది ఫోర్లు, ఆరు సిక్సర్లు
- 42 బంతుల్లోనే సెంచరీ.. విండీస్ బౌలర్లపై విధ్వంసం
- ఇషాన్‌తో అజేయంగా 137 పరుగుల భాగస్వామ్యం
- 32 బంతులు మిగిలుండగానే ఎనిమిది వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం





**లక్నో, అక్టోబర్ 6 :** కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ బ్యాట్ ఝుళిపిస్తే.. వెస్టిండీస్ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. తొలి అంతర్జాతీయ టీ20 శతకంతో అయ్యర్ విధ్వంసం సృష్టించగా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో మంగళవారం జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్‌ను భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 172 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయ్యర్ 43 బంతుల్లో పది ఫోర్లు, ఆరు సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేశాడు. కేవలం 42 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. వెస్టిండీస్‌పై అంతర్జాతీయ టీ20ల్లో భారత బ్యాటర్ సాధించిన అత్యంత వేగవంతమైన శతకంగా ఇది నమోదైంది.



## 35కే రెండు.. ఆ తర్వాత అయ్యర్ ఊచకోత

లక్ష్య ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అభిషేక్ శర్మ 21 పరుగులకు రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో ఔటవగా.. సంజూ శాంసన్ 11 పరుగులకే అకీల్ హొసేన్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. దీంతో 3.3 ఓవర్లలోనే భారత్ 35 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అయ్యర్‌కు ఇషాన్ కిషన్ అండగా నిలిచాడు. తొలుత కాస్త ఆచితూచి ఆడిన అయ్యర్.. క్రీజులో కుదురుకున్నాక గేర్ మార్చేశాడు. 28 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన అతడు.. ఆ తర్వాత విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చివరకు సిక్సర్‌తో 42 బంతుల్లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు ఇషాన్ కిషన్ 37 పరుగులతో అజేయంగా నిలిచి కెప్టెన్‌కు చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 137 పరుగులు జోడించి భారత్‌ను విజయతీరాలకు చేర్చారు.

## నమన్ ధీర్ అరంగేట్రంలోనే అదుర్స్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 56, షాయ్ హోప్ 52 పరుగులతో రాణించారు. భారత్ తరఫున అరంగేట్ర ఆటగాడు నమన్ ధీర్ మూడు వికెట్లతో ఆకట్టుకోగా.. అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



# ఎవరికోసమో నేను మారలేను..

## ట్రోలర్స్‌కు రష్మిక స్ట్రాంగ్ కౌంటర్!

**హైదరాబాద్, అక్టోబర్ 6 :** తనపై సోషల్ మీడియాలో వచ్చే వరుస ట్రోలింగ్స్, విమర్శలపై ప్రముఖ కథానాయిక రష్మిక మందన్న తీవ్రస్థాయిలో స్పందించారు. విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్రబృందం ప్రమోషన్లలో వేగం పెంచింది. ఈ క్రమంలో ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో తన వ్యక్తిత్వం, సోషల్ మీడియా వ్యాఖ్యలపై రష్మిక స్పష్టమైన వివరణ ఇచ్చారు. తాను అందరితో సరదాగా, స్నేహపూర్వకంగా ఉ ఒడటాన్ని కొందరు మరోలా అర్థం చేసుకుంటున్నారని రష్మిక ఆవేదన వ్యక్తం చేశారు. "అందరితో మంచిగా ఉండటం నా బలహీనత కాదు. నేను ఉన్న చోట ఎల్లప్పుడూ సానుకూల (పాజిటివ్) వాతావరణం ఉండాలని, సరదాగా ఉండాలని అనుకుంటాను. దీనికి ఎవరు ఏ పేరు పెట్టినా నాకు పట్టింపు లేదు. లోకంలో ప్రతీ ఒక్కరికీ నేను నచ్చాల్సిన అవసరం లేదు, ఎవరి కోసమో నా తత్వాన్ని నేను మార్చుకోలేను. నేను సరదాగా ఉండటం వల్ల నా కుటుంబం, స్నేహితులు సంతోషంగా ఉంటారు, అది నాకు చాలు" అని ఆమె తేల్చి చెప్పారు. ప్రస్తుతం రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక 'రణబాలి' సినిమా విషయానికొస్తే.. రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్-ఇండియా చిత్రం 1854 నుంచి 1878 మధ్య జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ నాలుగు భాగాల డాక్యుమెంటరీ సిరీస్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపించనుండగా, అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు.

# నీకు ఎయిడ్స్ ఉందా అని అడిగాడు

## బిగ్‌బాస్‌లో నటి గాయత్రి సురేష్ సంచలన వ్యాఖ్యలు!



కొచ్చి, అక్టోబర్ 6 : ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్' వేదికగా మలయాళ నటి గాయత్రి సురేష్ తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన తీవ్రమైన చేదు అనుభవాన్ని పంచుకుని సంచలనం సృష్టించారు. ప్రముఖ నటుడు మోహన్‌లాల్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'బిగ్‌బాస్ మలయాళం సీజన్-8'లో పాల్గొంటున్న ఆమె.. ఓ టాస్క్ సందర్భంగా తన గతం, విఫలమైన సంబంధాల గురించి భావోద్వేగంగా మాట్లాడారు. టాస్క్‌లో భాగంగా జీవితంలో మిమ్మల్ని అత్యంత తీవ్రంగా గాయపరిచిన వ్యక్తితో మాట్లాడే అవకాశం వస్తే ఏం చెబుతారని బిగ్‌బాస్ ప్రశ్నించగా.. గాయత్రి 2021 నాటి సంఘటనను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో తాను ఒక వ్యక్తిని తన జీవిత భాగస్వామిగా భావించి 'సిచుయేషన్‌షిప్'లో ఉన్నానని తెలిపారు. బంధం మొదలైన తొలి వారంలోనే సదరు వ్యక్తి "నీకు ఎయిడ్స్ ఉందా?" అని ప్రశ్నించాడని, ఆ మాట తన మనసును తీవ్రంగా గాయపరిచిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్షణమే అతనితో సంబంధాన్ని తెంచుకున్నానని వెల్లడించారు. తరువాత అతనికి వేరొకరితో సంబంధం ఉందని తెలిసిందని, అంతేకాకుండా అదే సమయంలో తనకు జరిగిన కారు ప్రమాదం, వివాదాల సమయంలో సదరు వ్యక్తి తనను ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయాడని తెలిపారు. తన జీవితంలో పలువురు బాధపెట్టినప్పటికీ, తనను అత్యంత తీవ్రంగా క్షోభకు గురిచేసిన సంఘటన ఇదేనని గాయత్రి సురేష్ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలోనూ, సినీ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.



# 'సిగ్మా'తో నా జర్నీ.. మరువలేనిది!

## కోలీవుడ్ ఎంట్రీపై ఫరియా అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు

### 'ప్రేక్షకుల ఆదరణ చూస్తుంటే ఆనందంగా ఉంది'

**చెన్నై, అక్టోబర్ 6 :** 'సిగ్మా'తో మొదలైన నా తమిళ సినీ ప్రయాణం ఇప్పటికే ప్రత్యేకం.. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే ఈ జర్నీ మరింత మరువలేనిదిగా మారుతోంది' అంటూ నటి ఫరియా అబ్దుల్లా ఆనందం వ్యక్తం చేశారు. సందీప్ కిషన్ హీరోగా, జాసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఆమె.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సినిమా అనుభవాలను పంచుకున్నారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన యాక్షన్ అడ్వెంచర్ డ్రామా 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో దర్శకుడు జాసన్ సంజయ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి ఫరియా మాట్లాడుతూ.. ఆయనకు తన కథను తెరపై ఎలా చూపించాలనే విషయంలో ఎంతో స్పష్టత ఉందని తెలిపారు. 'జాసన్ సంజయ్‌తో పనిచేయడం అద్భుతమైన అనుభవం. తాను ఏం తెరకెక్కించాలనుకుంటున్నారనే విషయంలో ఆయనకు పూర్తి స్పష్టత, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అదే ఉత్సాహం మా అందరిలోనూ జోష్ నింపింది. టీమ్ మొత్తం ఈ ప్రాజెక్టును ఎంతో ఆస్వాదిస్తూ పూర్తి చేసింది' అని ఫరియా చెప్పారు. 'సిగ్మా'తో తన తమిళ సినీ ప్రయాణాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. థియేటర్లలో సినిమాను చూస్తూ ప్రేక్షకుల స్పందనను ప్రత్యక్షంగా గమనించడం ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో భాగం కావడం, ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించడం తనకు సంతోషాన్నిస్తోందని ఫరియా తెలిపారు.



# ఆసక్తికరంగా 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. మహిమా నంబియార్ కథానాయిక, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది ఈ సినిమా. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ ను విడుదల చేశారు.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com